క్లుప్తంగా

రహదారులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట ఈస్ట్: రెడ్డినగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్‌రోడ్లు, సైడు కాల్వలు, కల్వర్ట్‌ల నిర్మాణాలను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో కలసి రెడ్డినగర్‌కు చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అక్కడి శ్రీవినాయకుని ఆలయంలో పూజలు జరిపిన అనంతరం ఆప్రాంతంలోని సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ. 40 లక్షల వ్యయంతో 540 మీటర్ల నూతన సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ డీఈ కె.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గడప-గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎన్నెస్పీ కాలువ పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రం నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వరకు ఈ రహదారి నిర్మాణం ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరు గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో నిరంతరం అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం పనులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పనులు పరిశీలించిన వారిలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, ఏఈ వెంకటేశ్వర స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు లింగా శ్రీనివాసరావు, ముండ్రు రాఘవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

వినుకొండ (నూజెండ్ల): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వినుకొండ మండలంలోని దొండపాడు పంచాయతీ పరిధిలోని 5 వార్డు, హస్సనాయునిపాలెం పంచాయతీ పరిధిలోని 6వ వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేయడమైనదని రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్‌లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 8 నుంచి 10 తేదీ వరకు, ఈ నెల 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 19వ తేదీన పోలింగ్, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నట్లు వివరించారు.

ఈత పోటీల్లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థికి పతకాలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ 2023-24 పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 3 రజిత, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు మంగళవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలలో కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఆక్వాటిక్ (స్విమ్మింగ్) చాంపియన్‌షిప్ పోటీలలో జగదీష్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు బటర్‌ఫ్లై విభాగాలలో రజిత పతకాలు, 200 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థి జగదీష్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి ఆజాదికా అమృత్ మహోత్సవం

శావల్యాపురం: ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నీ గ్రామపంచాయతీల్లో నేటి నుంచి ఈనెల 15 వరకు వివిధ రకాల కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు, అధికారుల సారథ్యంలో ప్రారంభం అవుతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ నాభూమి-నాదేశం నేల తల్లికి నమస్కారం అమరవీరులకు వందనం కార్యక్రమం, ప్రతిజ్ఞ, వసుద వందనం, అమరవీరులకు ఘన నివాళి, చివరి రోజు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయపతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ ఉపాధి పథకం నిధులు రూ. 7 వేల వ్యయంతో నాభూమి-నాదేశం శిలాఫలకం నూతనంగా ఏర్పాటు చేసి తదుపరి ప్రజాప్రతినిధుల సారథ్యంలో ఆవిష్కరించానన్నారు.

ప్రతిఇంటా సంక్షేమ పరిమళాలు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో నాల్గోరోజు గడప గడపకు కార్యక్రమం



యడ్లపాడులో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటా సంక్షేమ పరిమళాలు వెదజల్లుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడులో నాల్గోరోజైన మంగళవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సవళ్లలోని తిరుపతమ్మ గుడిలో పూజలు, ఎస్టీ కాలనీలోని చర్చి సంఘస్తులతో కలిసి మంత్రి రజిని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇంటింటి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. సుగాలీ కాలనీ, బోయకాలనీ, చెన్న కేశవపురం (సవళ్లు), ఎరుకల కాలనీ, రైస్‌మిల్లు వెనుక బజార్లు, పాత రెవెన్యూ కార్యాలయం బజారు, పోలీస్ స్టేషన్ వెనుక ఎస్టీ కాలనీ, కొండపైన గృహాలను సైతం మంత్రి రజిని పార్టీ శ్రేణులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పర్యటించారు. అక్కా అమ్మ ఒడి పథకం అందిందా.. అవ్వా పెన్షన్ వస్తుందా.. చిన్న బడికెళ్తున్నావా.. జగన్ మామయ్య ఇచ్చిన కిట్లు తీసుకున్నావా.. ఎలా ఉన్నాయ్.. ట్యాబ్ వాడుతున్నావా? అంటూ నవ్వుతూ ప్రతిఒక్కరినీ పలకరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. వివిధ పథకాలను అందుకున్న మహిళలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా తమ కుటుంబాలకు జరిగిన లబ్ధిని సంతోషంగా మంత్రి రజినికి వివరించారు. ఒక్కొక్క కుటుంబానికి లక్షల కొలది లబ్ధి చేకూరిన కరపత్రాలను పంపిణీ చేస్తూ, స్థానికంగా ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. అలాగే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు, సక్రమంగా ప్రభుత్వ సేవల్ని అందిస్తున్నారా అంటూ ఆరా తీశారు. జగనన్న సురక్షా కార్యక్రమం గురించి తెలుసుకుని సద్వినియోగం చేసుకున్నారా ఏఏ సర్టిఫికెట్లు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ముందుకు సాగారు.

ఇంటింటికీ వెళ్లి..

దశాబ్దాల నుంచి వందకు పైగా కుటుంబాలు స్థిర నివాసాలు కల్పించుకుని నివసిస్తున్న సవాళ్ల ప్రాంత వాసులకు నేటికీ పట్టాలు లేవని వాటిని మంజూరు చేయాలంటూ మంత్రి రజిని దృష్టికి తెచ్చారు. ఈ ప్రాంతంలో వడ్డెర, బోయ, పాములోళ్ల వంటి అనేక కులాలకు చెందిన పేదలు ఉన్నారని వారందరికీ పట్టాల పంపిణీ విషయం గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని వివరించారు. అలాగే బోయకాలనీ, ఎస్టీ (ఎరుకల) కాలనీల్లో ఏ చిన్న శుభకార్యం నిర్వహించుకోవాలన్నా వీధుల్లోనే కావడంతో వర్షం ఇతరేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రితో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ రెండు కాలనీల్లో కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేయాలంటూ ఆయా కాలనీ పెద్దలు కోరారు.

స్పందించిన మంత్రి తమ సంఘం తరుపున వినతి పెట్టుకుంటే ఆయా కార్పొరేషన్ ద్వారా ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. సీతమ్మ చెరువులోని 52 ఎకరాల్లో గ్రామానికి చెందిన సన్నచిన్న కారు రైతులు ఆకుకూరలు, కూరగాయలు, వరి మాగాణీ సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, గత టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు అక్కడ మట్టి తవ్వి అమ్ముకున్నారని, దీంతో జీవనోపాధి పోయి రోడ్డున పడ్డ సుమారు 50 కుటుంబాలను ఆ పార్టీ నాయకులెవరూ పట్టించుకోలేదని మంత్రి రజిని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న పథకాలు అంది సంతృప్తిగా ఉన్నామని, జీవనోపాధికి ప్రత్యామ్నాయం ఏదైనా చూపించాలని కోరారు. సంబంధిత అధికారులను పిలిచి ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైస్‌చైర్మన్ ఎం.వీరారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు కర్నాట సుబ్బారావు, కురంగి నాగమల్లేశ్వరరావు, బండ్ల పున్నారావు, రామ్‌కుమార్, షాజహాన్, యామర్తి కోటేశ్వరరావు, వల్లెపు సేటు, మటన్ శ్రీను, నాని, చిన్న, ఉసర్తి వెంకటేష్, కొండయ్య, అంజమ్మ, లక్ష్మి, షేక్ షంషుజుహా, గోస్‌సంధాని, పఠాన్ తలహాఖాన్, ముజాఫా, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, వాసు, కె.శ్యామ్యేల్‌పాల్, ఎ.శ్యామ్ పాల్, జంగా ప్రసన్న, పందుల బుల్లెబ్బాయి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

- మరో నాలుగు నెలల వరకు ఇబ్బంది లేదు
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- మరో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం



అధికారులతో కలసి మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తకుండా మంచినీటి చెరువులను నింపినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించే నకరికల్లు మంచినీటి రిజర్వాయర్, శాంతినగర్ రిజర్వాయర్లను మంగళవారం మున్సిపల్ అధికారులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా తాగునీటి అవసరాలకు అనుగుణంగా మరో నాలుగు నెలలకు సరిపడేలా మంచినీటి చెరువులను నింపినట్లు తెలిపారు. నరసరావుపేటతో పాటు వినుకొండ, చిలకలూరిపేట తదితర పట్టణాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీటిని విడుదల చేయాలని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఇరిగేషన్ అధికారులను, సీఎంకు చేసిన విజ్ఞప్తి మేరకు సాగర్ కుడి కాల్వ నుంచి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేశారని తెలిపారు. బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీటిని మున్సిపల్ అధికారులు గత 15 రోజుల నుంచి మంచినీటి చెరువులకు మళ్లించారని తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే శాంతినగర్ రిజర్వాయర్‌ను 338 అడుగుల పూర్తిస్థాయితో నింపారన్నారు. అలాగే 260 ఎకరాల మేర ఉన్న నకరికల్లు రిజర్వాయర్‌ను 131 ఎల్‌బీతో నింపారని వివరించారు. పట్టణ జనాభా నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రెండు రిజర్వాయర్లకు తోడు మరో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈమేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. శివారు ప్రాంత ప్రజల అవసరాల మేరకు కొత్తగా 3 వేల నీటి కుళాయిలను మంజూరు చేశామన్నారు. దీనికితోడు ఇటీవల కాలంలో భారీగా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు చోటు చేసుకున్నాయని, వారికి కూడా తాగునీటి వసతి కల్పించామని తెలిపారు. దీంతో తాగునీటి సరఫరాలో కొంత ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రస్తుతం నాలుగు నెలలకు సరిపడా తాగునీటి నిల్వలు ఉన్నాయన్నారు. కాగా, కె.బి.ఆర్.పార్క్, సాయినగర్‌లో మరో రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. వీటిద్వారా సాయినగర్, రెడ్డినగర్ ప్రాంతాలలో తాగునీటి సమస్య తలెత్తదని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, ఎంఈ దాసరి శ్రీనివాసరావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): గత మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో చర్చిలపై, క్రైస్తవులపై, స్త్రీలపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ వినుకొండ నియోజకవర్గ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవ సమాజం సిగ్గుపడేలా, తలదించుకునేలా మహిళలను వివస్త్రలను చేసి కొన్ని వేల మంది అరాచక శక్తులు అత్యాచారం చేయడమే కాకుండా హత్యలు చేశారన్నారు.

సుమారు 3 వేల మందితో ర్యాలీ నిర్వహించి శివయ్యస్తూపం సెంటర్‌లో మోకాళ్లపై భక్తులు దేశంలో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్విన్‌హోమ్, ఏఐసీసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అమృతపూడి జాన్‌హైడ్‌రాజ్, దారా రాజశేఖర్, రెడ్డిబోయిన గాంధీ, దేవప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎం.ఏలియా, రవిబాబు, రామయ్య, కొత్త రవికిరణ్, కోట శివకుమార్, తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ పత్రా ఫిలిప్, జోసఫ్, బేతం మోజెస్, జేమ్స్, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి టీం వర్క్ అవసరం



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొంపిచర్ల: సంస్థలో అందరూ ఉద్యోగులు కలిసి పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను చేరటంతో పాటు ఖాతాదారుల మన్ననలను కూడా పొందవచ్చు అని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ తిమ్మారెడ్డి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన బదిలీ అయిన సందర్భంగా వి.రెడ్డిపాలెం చైతన్య గోదా వరి బ్యాంకు ఆవరణలో నిర్వహించిన అభినందనల సభలో మాట్లాడారు. బ్యాంకు ఉన్నతాధికారుల సహచర సిబ్బంది సహకారంతోనే రూ.100 కోట్లు ఉన్న బ్యాంకును తన మూడు సంవత్సరాల సర్వీస్‌లో రూ.200 కోట్లు చేయగలిగామన్నారు. వి.రెడ్డిపాలెం బ్యాంకు పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తమ బ్యాంకు సేవలను వినియోగించుకున్నారన్నారు. రుణాలు పొందటంతో పాటు చెల్లింపులో కూడా ఖాతాదారులు క్రమశిక్షణతో ముందుంటారన్నారు. అందువల్లే బ్యాంకులో జీరో పర్సంట్ ఎన్‌పీఏ చేయగలిగామన్నారు. డ్వాక్రా సంఘాలు, వీవోఎల్‌లు సహకారం వల్లనే బ్యాంకులో నిర్దిత లక్ష్యాలను అధిగమించగల్గిమన్నారు. బ్యాంక్‌కు ఎన్ని అవార్డులు వచ్చినా వాటి సాధనలో బ్యాంకు లు పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి శ్రమ ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. బ్యాంకు సేవలను ప్రజల చేరువ చేయటంలో కిషోర్ కుమార్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా బ్యాంకు మేనేజర్ బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రెడ్డి కూడా మంచి సేవలు అందించి, ప్రజా మన్ననలను పొందాలని వక్తలు కోరారు. అభినందన సభకు నూతన మేనేజర్ అధ్యక్షత వహించగా, అన్నవరం పీఏసీఎస్ సీఈవో పొలిమేర వెంకట రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వసంత కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ టి.రాజు, సురేష్, సుబ్బారావు, ఖాతాదారులు ముచ్చుమారి వెంకటేశ్వ రెడ్డి, జక్కిరెడ్డి ఖాశిరెడ్డి, దుద్దకుంట సైదులు రెడ్డి, బోడే సైదులు రెడ్డి, యాంపాటి కోటిరెడ్డి, కేసరి కోటిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

స్వచ్ఛంద సంస్థల చేయూత

యడ్లపాడు: తిమ్మాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిలకలూరిపేటకు చెందిన అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ, ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో టాయిలెట్ బ్లాక్, హ్యాండ్ వాష్‌ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆయా సంస్థల ప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీవో శాంతకుమారి, అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ జాస్తి కృష్ణహరీష్, ఎం.విష్ణుప్రియ, డిప్యూటీ డైరెక్టర్ టి రామారావు, కోఆర్డినేటర్లు ఎం.శ్రీనివాసరావు, కె.డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాలి

చిలకలూరిపేట: బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాలని డాక్టర్ సింధు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తల్లిపాలు తాగిన పిల్లలే కాకుండా, ఆ పిల్లల తల్లులు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. తల్లిపాలు ఇచ్చిన స్త్రీలకు రొమ్ము క్యాన్సర్ సోకే ప్రమాదశాతం తగ్గిపోతుందని వెల్లడించారు. ముఖ్యంగా పిల్లలు రోగనిరోధక శక్తిని సంతరించుకుంటారని వివరించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు తోటకూర వెంకట నారాయణ, చంద్రశేఖరరావు, తొట్టెంపూడి వెంకటేశ్వర రావు, తియ్యగూర యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఉప ఎన్నికల సందడి

నాదెండ్ల: గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల ఉప ఎన్నికల సందడి ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నుండి గురువారం వరకూ ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసే అవకాశం కల్పించారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వార్డు నెం.6 (ఎస్సీ రిజర్వు), అమీన్ సాహెబ్‌పాలెం వార్డు నెం.4 (ఎస్సీ రిజర్వు), ఎండుగుంపాలెం వార్డు నెం.5 (ఎస్టీ రిజర్వు) స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఈ మూడుస్థానాలకు ఎన్నికలు జరగ్గా, అభ్యర్థులు మృతి చెందటంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. 11వ తేదిన నామినేషన్ల పరిశీలన, 14 సాయంత్రం నామినేషన్ల విత్‌డ్రా, అదే రోజు సాయంత్రం 5 గంటలకు తుది జాబితా ప్రకటించనున్నారు. ఆగస్టు 19 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇర్లపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తూబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణారావు, అమీన్ సాహెబ్‌పాలెం ఆర్‌వోగా సంకురాత్రిపాడు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం జానకీధరరావు, ఎండుగుంపాలెం ఆర్వోగా ఎంఈవో ఆంజనేయులు నియమితులయ్యారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నాదెండ్ల: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై జె.బలరామిరెడ్డి చెప్పారు. జాతీయరహదారిపై గణపవరం వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు తదితర వాహన చోదకుల వద్ద పత్రాలు పరిశీలించారు. పత్రాలు సరిగా లేని, నిబంధనలు పాటించని వారిపై 15 కేసులన మోదు చేసి రూ.2 వేల అపరాధ రుసుము వసూలు చేశారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయటంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం, ఓవర్ లోడ్‌తో ప్రమాదాలకు కారణమౌతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు రవాణ నిబంధనలు పాటించాలన్నారు. ఆయనతో పాటూ ఏఎస్సై రమేష్ ఉన్నారు.

సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

చిలకలూరిపేట: పట్టణ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పట్టణంలోని 30వ వార్డు పరిధిలోని మసీదు బజారు, గడ్డం బాషాబజార్‌లో డ్రెయిన్ల నిర్మాణం కోసం పరిశీలన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్, ప్రజల కోరిక మేరకు త్వరలో డ్రెయిన్ల నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. డ్రెయిన్ల నిర్మాణంతో పాటు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ ఖాజాబాను, మున్సిపల్ డీఈఈ తోట వెంకట రమణ, ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి లయన్స్ సేవా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న నక్కా కోటేశ్వరమ్మ

చిలకలూరిపేట: లయన్స్ క్లబ్ సేవా పురస్కారాలను చిలకలూరిపేటకు చెందిన క్లబ్ సభ్యులు దక్కించుకున్నారు. 2021-22 సంవత్సరానికి సంబంధించి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ విజేత అవార్డు కార్యక్రమం గుంటూరులోని బీవీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటకు చెందిన నక్కా కోటేశ్వరమ్మకు బెస్ట్ జోన్ చైర్మన్, లయన్ లేడీ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అవార్డులు లభించాయి. అలాగే ఇదే క్లబ్‌కు చెందిన బెస్ట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొల్లా అమర్, బెస్ట్ సెక్రటరీగా పెరుమాళ్ల సురేష్, బెస్ట్ గవర్నర్ అడ్వైజర్స్‌గా డాక్టర్ కొల్లా రామారావు, శిఖాకొల్లి శ్రీనివాస గుప్తా, చుక్కా విన్సెంట్ పాల్, బెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా పోలిశెట్టి నాగేశ్వరరావు, బెస్ట్ లయన్ లేడీస్ క్లబ్‌గా ఆలపాటి పద్మావతి అవార్డులు అందుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నట్లు నక్కా కోటేశ్వరమ్మ తెలిపారు.

రక్తహీనతపై అవగాహన పెంచుకోండి

- చెంఘీజ్‌ఖాన్‌పేట ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు రక్తహీనతపై పరీక్షలు
- 120 మందికి పరీక్షలు చేయగా వారిలో 15 మందికి రక్తహీనత గుర్తింపు



విద్యార్థినికి రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: రక్తహీనత అధిగమించడంపై ప్రతి విద్యార్థి అవగాహన కల్పించుకోవాలని ఆరోగ్య కార్యకర్త థామసమ్మ తెలిపారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రక్త పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి బాల సురక్ష కేంద్ర ఆధ్వర్యంలో పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు రక్త నమూనాలను సేకరించారు. రక్తహీనత కనుగొనేందుకు హెబీ పరీక్షలు నిర్వహించగా వీరిలో 15 మందికి రక్తహీనత ఉన్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం మాట్లాడుతూ రక్తహీనత లోపం లేకుండా ఉండేలా పౌష్టికాహారం తీసుకోవాలని వివిధ రకాల పండ్లు తినాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలను భుజించటం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు రక్తహీనతకు చెక్ చెప్పవచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల తినే ఆహారంపై శ్రద్ధ కనపరచాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు షేక్ గౌస్‌బాషా, సునీత, చంద్రయ్య, నాగజ్యోతి, హృదయరాణి, ఆశ వర్కర్లు ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: ఎస్సీల వర్గీకరణ కోరుతూ ఆగస్టు రెండవ వారంలో హైదరాబాద్‌లో జరగనున్న మాదిగల విశ్వరూపం మహాసభకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిరుగూరి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలో మంగళవారం మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుంటున్న తరుణంలో పార్టీలకు అతీతంగా మాదిగలు ఏకం కావాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడిచినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా వత్తిడి తీసుకు రావలసిన అవసరం ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి కమిటీల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుదాల డేవిడ్, పరుచూరి దీనమ్మ, కందుల శ్రీదేవి పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) BAJAJ MAXIMA CARGO 2022 MODEL AP07 TN 2103
2) PIAGGIO APE A/R DXL BS IV 2019 MODEL AP39 TJ 1623
Cell : 79818 68593
Door No. 9-6-23, 2nd Floor, Arundalpet, NARASARAOPETA.

NOTICE
IN THE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE :: GUNTUR
I.P. No. 81 / 2022
Between:-
Kolla Chenchu Rao ...Petitioner
and
Kolla Subba Rao & Others ...Respondents
To:
R-6: S.Satyam Prop.Pravallika Medical Needs, S/o.Not Known, R/o.D.No.1-10-97, Sattenapalli Road, Narasaraopet, Palnadu Dist.,
... ది.08-09-2023న ... 10.30ని.లకు ...
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 08-09-2023.
K. DURGA BHAVANI
Advocate for Petitioner. Srinivasa Rao Thota, Guntur.

బహిరంగ ప్రకటన
... M/s.Harisha Infra Rep. by its Partner Meer Masood Ali, S/o.Mohammod, Visakhapatnam వారు M/s. Jannat Trading Company Rep. by its Partners ... రూ. 9,75,00,000/- ... ది.21-04-2021 ... M/s. Jannat Trading Company Rep. by its Partners అయిన Zunaid Khan Mohammad Abdul Naeem Pasha ...
SYED ISMAIL, LL.M., Advocate. Guntur. Cell: 9390059122



